సాక్షి
పెద్దపల్లి

ఆదివారం : 10 ఆగస్టు 2025



ఘనంగా యజ్ఞోపవీత ధారణ

మంథని: జంద్యాల పూర్ణిమ సందర్భంగా మంత్రపురిలోని ఆలయాల్లో బ్రాహ్మణులు యజ్ఞోపవీత ధారణ చేశారు. పట్టణంలోని తమ్మిచెరువుకట్ట, పెంజేరుకట్ట ఆలయాల్లో హోమం కాల్చారు.



పోచమ్మకు బోనం మొక్కులు

యైటింక్లయిన్‌కాలనీ: జయశంకర్‌నగర్ ఏరియాలోని ఆలయంలో ప్రతిష్ఠించిన నల్ల పోచమ్మ అమ్మవారికి శనివారం బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులను గోస పెడుతున్నరు



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా సాగితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు సాగునీరు, ఎరువులు, రైతుబంధు కోసం గోసపడుతున్నరని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలకులు కాళేశ్వరంపై కక్ష పెంచుకుని ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. యూరియాను బ్లాక్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని ధ్వజమెత్తారు. నాయకులు రఘువీర్‌సింగ్, గంట రాములు, ఉప్పు రాజ్‌కుమార్, శ్రీకాంత్, గోపు ఐలయ్య, మారుతి, ప్రశాంత్, శ్రీనివాస్, సాగర్, వెంకన్న, రామరాజు, రమణ, నరేశ్, చంద్రమౌళి, ముత్తయ్య, కుమార్, సంపత్, భూమయ్య, గట్టయ్య, పెగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే హక్కులు



మాట్లాడుతున్న వైవీ రావు

రామగిరి(మంథని): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీతోనే సాధ్యమని ఆ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు అన్నారు. ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ రాంచంద్రారెడ్డి అధ్యక్షతన ఓసీపీ-2లో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రమోషన్ పాలసీలో భాగంగా గ్రేడ్ -డీ నుంచి సీ, సీ నుంచి బీకి మార్పు కోసం యాజమాన్యంతో చర్చించగా, త్వరలోనే ప్రమోషన్ ఉత్తర్వు వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులుజూపాక రాంచందర్, శ్రీనివాస్, అమరగండ పోశం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ-1 జీఎంకు వినతిపత్రం అందజేసి జీఎం ఆఫీస్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ప్రతీనెల ఒకటి నుంచి ఏడో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ఒక్కో గార్డుకు నెలకు 26 మస్టర్లు ఇచ్చేలా చూడాలని కోరారు. ఏడేళ్లుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈఎస్ఐ ఆస్పత్రి సౌకర్యం కల్పించి, రూ.40 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలని అన్నారు. నాయకులు ఎల్లాగౌడ్, గౌస్, సయ్యద్ సోహెల్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ఈఏడాది జూన్ 5వ తేదీలోగా కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు ఈనెల13లోగా రైతుబీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్యలో పుట్టిన (18 నుంచి 59ఏళ్ల మధ్య వయసు) రైతులు మాత్రమే బీమాకు అర్హులని ఆమె వివరించారు.

పవర్ కట్ ప్రాంతాలు

పెద్దపల్లిరూరల్: స్థానిక ఇండేన్ గ్యాస్ గోదాం, బీసీ హాస్టల్ ఏరియాతోపాటు పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూరు, నిమ్మనపల్లిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ తోపాటు విద్యుత్ స్తంభాల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన వివరించారు.

'శక్తిపుంజ్'ను పొడిగించాలి

గోదావరిఖని: శక్తిపుంజ్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ వరకు పొడిగించాలని బీఎంఎస్ జాతీయ నేత కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్ ద్వారా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు లేఖ పంపించారు. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోని కోల్ ఇండియాకు చెందిన 8 అనుబంధ సంస్థలు, తెలంగాణలోని సింగరేణిలో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగుల బదిలీలు, కుటుంబ సభ్యుల రాకపోకలు, పండుగలు, అత్యవసర పరిస్థితులు వంటి సందర్భాల్లో ఈ రైలు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కోల్‌బెల్ట్‌వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా రైలును పొడిగించేలా చూడాలన్నారు.

రాఖీ సంబురం



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ స్వరూప



ఎమ్మెల్యే విజయరమణారావుకు శుభాకాంక్షలు తెలుపుతూ..



గోదావరిఖని : చెట్టుకు రాఖీ కడుతున్న సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్



మంథని : మధుకు రాఖీ కడుతున్న సోదరి శశికళ

ఆత్మీయత, ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రాఖీ పండుగను జిల్లావ్యాప్తంగా శనివారం సంబురంగా జరుపుకొన్నారు. స్థానికంగా ఉన్నవారితోపాటు సుదూర ప్రాంతాలు, వివిధ జిల్లాలు, రాష్ట్రాల్లో స్థిరపడినవారు, విదేశాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టారు. నోరు తీపి చేశారు. సోదరులు కట్నకానుకలు ఇస్తూ సంబురాలు చేసుకున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తదితర ప్రముఖులకు పలువురు రాఖీలు కట్టి సోదరభావం పంచారు. – పెద్దపల్లిరూరల్

రిక'వరీ'

స్త్రీనిధి రుణాలు పక్కదారి

- వీవోఏ, సీసీలు, బుక్ కీపర్లు, ఆర్పీల మాయాజాలం
- సోషల్ ఆడిట్‌లో గుర్తించిన అధికారులు
- రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు సన్నద్ధం
- 100 శాతం రికవరీ లక్ష్యం

➡ రామగిరి మండలానికి చెందిన వీవోఏ రూ.3.57లక్షలు అక్రమంగా రుణం తీసుకున్నారు. అంతేకాదు.. రూ.34.43 లక్షల రుణవాయిదాల సొమ్మునూ సొంతానికి వాడుకున్నారు. ఇలా మొత్తంగా రూ.38.01లక్షలను 26 మహిళా గ్రూపుల్లోని 172 మంది సభ్యుల డబ్బులు దుర్వినియోగం చేశారు.

➡ పాలకుర్తికి చెందిన వీవోఏ ఒకరు.. సభ్యులకు తెలియకుండా రూ.2.5 లక్షలు రుణం తీసుకున్నారు. స్త్రీనిధికి చెల్లించాల్సిన రూ.10.25 లక్షలు రీపేమెంట్ చేయకుండా కాజేసినట్లు సోషల్ ఆడిట్‌లో తేలింది.

➡ ఇలా జిల్లావ్యాప్తంగా మెప్మా ద్వారా మంజూరు చేసిన స్త్రీనిధి రుణాల్లో రూ.4.81కోట్లు దుర్వినియోగమయ్యాయి. ఇప్పటివరకు రూ.4.01 కోట్లు రికవరీ చేశారు. సెర్ప్ ద్వారా మంజూరు చేసిన స్త్రీనిధి రుణాల్లో రూ.13.87 కోట్లు కూడా దుర్వినియోగం చేశారు. ఇందులోని రూ.6.24కోట్లు రికవరీ చేశారు.



సాక్షి, పెద్దపల్లి: పేదరిక నిర్మూలన, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తోంది. అయితే, కొందరు ఉద్యోగుల తీరుతో రుణాలు, రుణవాయిదాల సొమ్ము పక్కదారి పడుతోంది. సెర్ప్, మెప్మా ద్వారా మహిళా సంఘాలకు అందాల్సిన బ్యాంకు రుణాలు దుర్వినియోగమవుతున్నాయి. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, వడ్ల కొనుగోళ్లలో కీలకంగా వ్యవహరించే పొదుపు సంఘాల లెక్కలు సరిచేసే వీవోఏలు, ఆర్పీలు, సీసీలు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. వాయిదాలు చెల్లించిన సందర్భంలో పాసుపుస్తకాల్లో సంతకాలు చేయడానికి కూడా ఆర్పీలు రూ.100 చొప్పున మహిళా సభ్యుల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆర్థిక చేయూతకు స్త్రీనిధి..

పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్త్రీనిధి బ్యాంకు ఏర్పాటు చేసింది. దీనినుంచి రుణాలు మంజూరు చేస్తూ మైక్రోఫైనాన్స్‌ల నిర్వాహకుల అధికవడ్డీల బారీనుంచి కాపాడాలనేది దీనిలక్ష్యం. ఇందులో పేద మహిళలకు స్వయం సహాయక గ్రూపుల పేరిట సభ్యత్వం ఇస్తూ ప్రతినెలా కొంత పొదుపు చేయించేలా ప్రణాళిక రూపొందించింది. ఇలా ఒక్కో గ్రూపులో 10 మంది మహిళలను సభ్యులుగా చేర్చుకుంటారు. ఆర్నెల్లు నిండిన ప్రతీగ్రూపు రుణం పొందేందుకు అర్హత సాధిస్తుంది. రుణం తీసుకున్న సభ్యుల నెలసరి వడ్డీని బ్యాంకు ఖాతాలో జమచేయాల్సి ఉంటుంది. అయితే, రుణాలు మంజూరు చేయించే సమయంలోనే ఆర్పీలు ప్రతీసభ్యురాలి నుంచి చెల్లించే నగదుపై రూ.500 రూ.1000 వరకు కమీషన్ వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రుణం రికవరీ సమయంలో వసూలు చేసిన వాయిదా డబ్బులను సైతం కొందరు ఆర్పీలు బ్యాంకులో చెల్లించకుండా తమ సొంతానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

క్షేత్రస్థాయిలో మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారా, అప్పులు తిరిగి చెల్లిస్తున్నారా, నిబంధనల మేరకు సంఘాలను నిర్వహిస్తున్నారా? తదితర అంశాలను పరిశీలించేందుకు కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సీవో), వారిపై టీఎంసీ, ఏడీఎంసీ, డీఎంసీ, వారందరిపై ప్రాజెక్టు డైరెక్టర్ ఉన్నారు. వారందరికీ మహిళా సమాఖ్యలతో పాటు అదనపు సంక్షేమ పథకాల బాధ్యతలను కూడా అప్పగిస్తున్నారు. దీంతో సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. పొదుపు సంఘాల్లో జరుగుతున్న గందరగోళంతో చాలామంది మహిళలు ఇబ్బందులు పడటమే కాకుండా కొందరు సంఘాల నుంచి వైదొలుగుతున్నారు. మరికొన్ని సంఘాలను రద్దు చేసుకుంటున్నారు.

100శాతం రికవరీ చేస్తాం

స్త్రీనిధి రుణాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో అక్రమాలకు పాల్పడిన వారినుంచి 100శాతం సొమ్ము రికవరీ చేస్తాం. ఇప్పటికే కలెక్టర్ 15 రోజుల్లో చెల్లించని వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించాం. బకాయిలు చెల్లిస్తేనే కొత్తగా రుణాలు పొందవచ్చు. ఈ రుణాలతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావొచ్చు.

– కాళిందిని, డీఆర్‌డీవో

ఇంటిగ్రేటెడ్.. ఇక 'ఇండోర్'



వ్యవసాయ మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- బ్యాడ్మింటన్ స్టేడియం నిర్మాణానికి నిధులు
- రూ.2.30 కోట్లతో పనులు
- బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రోత్సాహం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇటీవల రూ.2.30కోట్లు మంజూరు చేసింది. దీంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లయ్యింది.

వ్యవసాయ మార్కెట్‌లో స్టేడియం

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం కొన్నేళ్ల క్రితం నిర్మాణాలు చేపట్టారు. అవి ఇంకా పూర్తికాలేదు. పైగా ఏళ్లుగా అసంపూర్తిగా ఉంటున్నాయి. దీనికితోడు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుపై స్థానికులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష.. అసంపూర్తి నిర్మాణాలను బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం కోసం వినియోగించేందుకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

పారిశ్రామిక ప్రాంతాల్లోనే క్రీడలు..

బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఆడుకునేందుకు అనువైన కోర్టులు లేక అవస్థలు పడుతున్నారు. ఆసక్తి గలవారు బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ, సింగరేణి స్టేడియంలోకి వెళ్లి ఆడుకునే పరిస్థితి ఉంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఇండోర్ నిర్మాణం చేపట్టనుండడంతో క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టే అవకావం ఏర్పడింది.

రూ.2.30 కోట్లు మంజూరు..

బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల రూ.2.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో వ్యవసాయ మార్కెట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలను సద్వినియోగం చేసుకుంటూనే ఇండోర్ స్టేడియంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదించారు. వీలైనంత త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అధికారవర్గాలు తెలిపాయి.

ఇంటిగ్రేటెడ్ ఇంతే సంగతులు..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ నియోజవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభించింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే.. ప్రజాభీష్టం మేరకు ప్రధాన కూరగాయల మార్కెట్‌ను యథాస్థానంలోనే కొనసాగిస్తాననే హామీ మేరకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, శ్రీధర్ బాబుతో సంప్రదించారు. ఈమేరకు కూరగాయల మార్కెట్ పనులకు యథాస్థానంలోనే శ్రీకారం చుట్టారు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం నిలిచిపోయినట్లయ్యింది.

శిక్షణకు ఉపయోగం



జిల్లా కేంద్రం పెద్దపల్లిలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. దీని ద్వారా జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులు నైపుణ్యం పెంచుకుంటారు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తారు.

– విజయ్, కోచ్, గోదావరిఖని

క్రీడలకు ప్రోత్సాహం



బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఆలోచనతోనే పెద్దపల్లిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు త్వరలోనే మొదలవుతాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం చేపట్టిన నిర్మాణాలను ఇండోర్‌స్టేడియం కోసం ఉపయోగిస్తాం.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

ఆదివాసీలను అంతం చేసేందుకు కుట్ర

- ప్రజాసంఘాల నేతల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

పెద్దపల్లిరూరల్: బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై ఉక్కుపాదం మోపి అంతం చేసేందుకు కుట్ర పన్నుతోందని పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధా నకార్యదర్శులు బొంకూరి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, మాదన కుమారస్వామి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం ఆదివాసీల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అడవుల్లో ఆదివాసీలు లేకుండా చేసేందుకే బస్తర్‌లో 250 పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేసిందన్నారు. 2005లో సల్వాజుడుం, 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్, 2015లో ఆపరేషన్ సమాధాన్, 2024లో ఆపరేషన్ కగార్ పేరిట నరమేధం సాగిస్తోందని పేర్కొన్నారు. నాయకులు నారా వినోద్, ఎరుకల రాజన్న, విశ్వనాథ్, రత్నకుమార్, రామిళ్ల బాపు, గాండ్ల మల్లేశ్, పర్వతాలు, రాజలింగయ్య, సత్యనారాయణ, శంకర్, స్వామి పాల్గొన్నారు.

కిక్కిరిసిన బస్టాండ్‌లు



గోదావరిఖనిలో..



పెద్దపల్లిలో..

గోదావరిఖనిటౌన్: రాఖీ పండుగ సందర్భంగా శనివారం జిల్లాలోని గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సుదూర ప్రాంతాలకు అత్యధికంగా బస్సులు నడిపించడం, లెక్కకు మించి ప్రయాణికులు తరలిరావడంతో నిరీక్షణ తప్పలేదు. గంటల కొద్దీ పడిగాపులు పడిన ప్రయాణికులు.. ముఖ్యంగా మహిళలు, యువతులు, విద్యార్థినులు.. తమ సోదరుల ఇళ్లకు సకాలంలో చేరుకోలేక సతమతమయ్యారు.

మూడు దశాబ్దాలకు సరిపడా నిల్వలు

- భారీగా బొగ్గు నిక్షేపాలు గుర్తించిన ఎక్స్‌ప్లోరేషన్ విభాగం
- రామగుండంలో కొనసాగుతున్న ఉద్యోగుల అన్వేషణ



డ్రిల్లింగ్ యంత్రాల ద్వారా సాగిస్తున్న అన్వేషణ



ఎక్స్‌ప్లోరేషన్ గుర్తించిన బొగ్గు లేయర్లు

గోదావరిఖని: బొగ్గు నిల్వల గుర్తింపులో ఎక్స్‌ప్లోరేషన్(అన్వేషణ) విభాగంగా ముందుకు సాగుతోంది. కొన్ని గనుల్లో నిల్వలు అడుగంటిపోతుండడంతో అన్వేషణ వేగవంతం చేస్తోంది. ప్రధానంగా రామగుండం రీజియన్‌లోని ఆరు ప్రాంతాల్లో సర్వే చేస్తోంది. భూఉపరితలం నుంచి సుమారు 250 మీటర్ల లోతులో బొగ్గు పొరలు ఉన్నట్లు గుర్తించింది. ఇక్కడ 30 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు గుర్తించినా.. గనులకు అనుసంధానంగా వెలికితీసే విధానంపై సమాలోచనలు చేస్తోంది.

జీడీకే-1 ద్వారా వెలికితీత..

కొత్త టన్నెల్ ఏర్పాటు చేసి గుర్తించిన బొగ్గు నిల్వలను జీడీకే-1గని ద్వారా వెలికి తీసేందుకు యాజమాన్యం ప్రయత్నాలు ప్రారంభించింది. 1961లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాగా, ప్రస్తుతంగా బొగ్గు వెలికితీత శరవేగంగా సాగుతోంది. భూగర్భగనుల్లో తట్టాచెమ్మస్ ద్వారా ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తి.. ఇప్పుడు పూర్తిస్థాయి యాంత్రీకరణతో కొనసాగుతోంది. భూగర్భగనులతో పాటు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు రావడంతో బొగ్గు వెలికితీతలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఏటా 25 మిలియన్ టన్నులు వెలియి తీయగా.. ప్రస్తుతం 72 మిలియన్ టన్నులకు చేరుకుంది.

గోదావరి తీరంలో నిక్షేపాలు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం మండలం జనగామ గ్రామ శివారులో తొలిసారి బొగ్గు తవ్వకాలు 1959లో చేపట్టారు. రామగుండం రీజియన్‌లో తొలిసారి జీడీకే-1వ గనిలో 24 మిలియన్ టన్నుల నిల్వలు గుర్తించారు. 1961 నుంచి 2025 ఏప్రిల్ వరకు 21 మిలియన్ బన్నుల బొగ్గు వెలికితీశారు. ఇంకా 12ఏళ్ల పాటు తవ్వేందుకు 3 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయి. చాలాభూగర్భ గనుల నిల్వలు అడుగంటి త్వరలోనే మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఈక్రమంలో ప్రస్తుతం గోదావరి నది ఒడ్డున సమ్మక్క జాతర ప్రాంగణం, జీడీకే-5 ఓసీపీ, ఓసీపీ-2, అడ్రియాల ప్రాజెక్టు పోచమ్మ గుడికి వద్ద ఎక్స్‌ప్లోరేషన్ విభాగం ఆధ్వర్యంలో అన్వేషణ కొనసాగుతోంది.

250 మీటర్ల లోతులో నిక్షేపాలు..

గోదావరి నదీ తీరంలోని సమ్మక్క జాతర సమీపంలో సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ డ్రిల్లింగ్ ద్వారా బొగ్గు నిక్షేపాలు గుర్తిస్తోంది. 250 మీటర్ల లోతులో ఐదున్నర మీటర్ల, మూడు మీటర్ల వెడల్పుతో రెండు బొగ్గు పొరలను గుర్తించింది.

సింగరేణిలోనే కీలకం రామగుండం

ప్రస్తుతం రామగుండం రీజియన్‌లో ఆర్జీ-1,2,3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా కొనసాగుతున్నాయి. గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీల్లో ప్రాంతాలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా నాలుగు ఓసీపీలతో అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేస్తూ సింగరేణిలోనే రామగుండం రీజియన్ ప్రత్యేకత చాటుతోంది.

గనులకు అనుబంధంగానే..



జీడీకే-1వ గనికి అనుబంధంగా ఎక్స్‌ప్లోరేషన్ అన్వేషణ సాగుతోంది. గోదావరి నది పరీవాహక ప్రాంతంలో బొగ్గు నిల్వలకు ఢోకాలేదు. వాటిని ప్రస్తుత గనులకు అనుబంధంగా ఎలా వెలికితీయాలనే అంశంపై శోధన చేస్తున్నాం. హైవాల్ టెక్నాలజీ ద్వారా జీడీకే-1వ గనిలో బొగ్గు వెలికితీసే వీలుంది.

– శివన్నారాయణ, డీజీఎం, ఎక్స్‌ప్లోరేషన్

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య

గంగాధర: మండలంలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న అల్లకుంట గంగారాం(70) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన గంగారాం మధురానగర్‌లో తన పెద్ద కొడుకు వద్ద ఉంటున్నాడు. ఐదేళ్ల వ్యవధిలో భార్య, కూతురు, చిన్న కుమారుడు చనిపోయారు. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా కనిపించలేదు. శనివారం ఉదయం పెద్దకొడుకు శ్రీనివాస్ ఇంటి షట్టర్ తెరిచి చూడగా వెంటి లేటర్‌కు ఉరి వేసుకొని మృతి చెంది కనిపించాడు. శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన గూడ బాలేశ్వర్‌రెడ్డి(53) అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలు వెంటాడాయి. రెండేళ్ల క్రితం కుమారుడు శ్రీకర్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. భార్య మమత సిరిసిల్లలో ఆశకార్యకర్తగా పనిచేస్తుండగా, తల్లి వసంత ఊరెల్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలేశ్వర్‌రెడ్డి శనివారం ఉరివేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

బాలేశ్వర్‌రెడ్డి (ఫైల్)

జ్వరంతో బాలుడి మృతి

• సిరిసిల్లలో పండుగ పూట విషాదం

సిరిసిల్ల క్రైం: రాఖీ పండుగ రోజు ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆటో కార్మికుడు ఎర్రం బాలయ్య, మంజుల దంపతుల కుమారుడు అశ్విన్ సర్థాక్(6) మూడు రోజులుగా విషజ్వరంతో బాధపడుతున్నాడు. సర్థాక్‌ను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసినా జ్వరం తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించగా శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

అశ్విన్ సర్థాక్(ఫైల్)

సాక్షి సెల్ఫీ బంధన్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాఖీ పండుగను శనివారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ విత్ రాఖీకి భారీ స్పందన వచ్చింది పలువురు సోదరీమణులు సోదరులకు... బిడ్డలు.. తండ్రికి రాఖీ కట్టి సంబరపడ్డారు. తమ అనుబంధానికి గుర్తుగా సెల్ఫీ దిగి సందడి చేశారు.


ఆశిశ్ నందన్, దక్షశ్రీ, కోతిరాంపూర్, కరీంనగర్


వర్షిత, వైశ్విక్ కరీంనగర్


మాన్విక్ శౌర్య, మనుశ్రీ అలుగునూరు, కరీంనగర్


సోదరీమణులతో బాలే అశోక్, జగిత్యాల


రాఖీ వేడుకల్లో దేవేందర్ కుటుంబ సభ్యులు నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల


అన్నకు రాఖీ కడుతున్న జి. మేఘన కొండాపూర్, జగిత్యాల


గసికంటి గంగరాజుకు రాఖీ కడుతున్న సోదరి, రుద్రంగి


కస్తూరి రాజన్నకు రాఖీ కడుతున్న సోదరి లక్ష్మి, కోరుట్ల


కట్ట వేణుకు రాఖీ కడుతున్న సోదరి, తుమ్మనపల్లి జగిత్యాల జిల్లా


కటకం సురేందర్ కుటుంబం, సాయిరాంపూర్ కాలనీ , కోరుట్ల


రాఖీ కడుతున్న కుంట మనస్విని, ధ్రుతి, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట


లాల మహేశ్‌కు రాఖీ కడుతున్న సోదరి, కస్బే కట్కూర్, తంగళ్లపల్లి


రాఖీ వేడుకల్లో మానస కుటుంబం, బొప్పాపూర్, రాజన్న సిరిసిల్ల


నల్లాల మోహన్‌కు రాఖీ కడుతున్న పద్మ, వెంకట్రావ్‌పల్లి, బోయినపల్లి


సోదరీమణులతో నామని శ్రీధర్, వెల్ది, మానకొండూర్, కరీంనగర్


చెల్లెలు ఓమినిరెడ్డితో నర్సింహరెడ్డి, రాజన్న సిరిసిల్ల


నిషిత్, సాహితి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, రాజన్నసిరిసిల్ల


పారునంది శివతేజకు రాఖీ కడుతున్న సోదరి, మన్నెంపల్లి, తిమ్మాపూర్, కరీంనగర్


చిన్నారులతో రాఖీ కట్టించుకుంటున్న పిట్టల శ్రీకాంత్, సిరిసిల్ల


రజిని, రాకేశ్, బ్యాంక్ కాలనీ, కరీంనగర్


రాఖీలతో సమ్మెట శ్రీహర్షిత్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల


శశి, వేములవాడ


జక్కె సంయుక్త, జమ్మికుంట


రాఖీ కడుతున్న శ్రావ్య, జగిత్యాల


సింగు లక్ష్మీనారాయణ, సింగు శ్రీనిత్య, రాజీవ్‌నగర్ కాలనీ, చింతకుంట, కరీంనగర్


శ్రీయాన్స్, కమ్మర్‌పల్లి


శ్రీరాం కృష్ణ, విన్ను సరోజా, సంగెం, కోరుట్ల


రాఖీ వేడుకల్లో టి. రాంచరణ్ కుటుంబం, కనగర్తి, కోనరావుపేట, రాజన్న సిరిసిల్ల


తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బొంగాని భారతి, రేణికుంట, తిమ్మాపూర్, కరీంనగర్


ఉడుత శంకర్ యాదవ్, పన్నూర్, రామగిరి, పెద్దపల్లి


రాఖీలు చూపుతున్న విజపల్లి రవీందర్ కుటుంబం, కొత్తపల్లి, జమ్మికుంట, కరీంనగర్


వంతడ్పుల అంజలి, కల్లూరు, కోరుట్ల


విలాసాగరం గంగయ్య, గంగవ్వ, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


విలాసాగరం రాంతేజ, శరణ్య, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


వెగ్యారపు వెంకట అనీష్, కట్ట శ్రీమయుక్త, జగిత్యాల


నీలి శ్రీవైష్ణవి, శ్రీయ, రాయికల్, జగిత్యాల

భూ సమస్య పరిష్కారం కోసం టవరెక్కిన రైతు


టవర్ దిగుతున్న ప్రకాశ్‌రెడ్డి

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు యాళ్ల ప్రకాశ్‌రెడ్డి శనివారం ఓ కంపెనీ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. ప్రకాశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరికి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 74, 80లో చెరో 2.22 గుంటల భూమి ఉంది. ఈ భూములోంచే ధర్మారం- పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మించారు. రోడ్డు వైపుఉన్న భూమికి డిమాండ్ పెరిగింది. దీంతో ఇద్దరి మధ్య భూ సమస్య తలెత్తింది. ఈక్రమంలోనే సర్వేనంబరు 74లోని భూమిలో నర్సింహారెడ్డి దుక్కిదున్నుతుండగా.. ప్రకాశ్‌రెడ్డి అక్కడకు వెళ్లాడు. తనకు వాటాగా వచ్చిన భూమిలో ఎందుకు దున్నుతున్నావని ప్రశ్నించాడు. నర్సింహారెడ్డి ఆగ్రహంతో ప్రకాశ్‌రెడ్డిపై దాడికి యత్నించాడు. అంతటితో ఆగకుండా చంపుతానని బెదిరించాడు. గత్యంతరం లేక ప్రకాశ్‌రెడ్డి సెల్‌టవర్ ఎక్కాడు. వారసత్వంగా వచ్చిన ఈ భూమి పంపకం విషయంలో ఇద్దరూ సమానంగా పంచుకున్నా.. నర్సింహారెడ్డి తనకు అన్యాయం చేసినట్లు ఆరోపించాడు. ఇదే సమస్యపై గ్రామంలో పలుసార్లు పంచాయితీలూ జరిగాయన్నాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. సమస్య పరిష్కారం కోసమే టవర్ ఎక్కినట్లు వివరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో రైతు టవర్ దిగాడు. కాగా, ఈవ్యవహారం కోర్టు వరకు వెళ్లినట్లు సమాచారం.

ఖండాంతరాల్లో రాఖీ వేడుకలు


దుబాయిలో వరలక్ష్మీవ్రతం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలుగు వారంటేనే ఆధ్యాత్మికతకు, భారతీయ సంస్కృతికి ప్రతీకలు. ఈ క్రమంలోనే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా(యూఎస్ఏ)లోని లుసియానా స్టేట్ లఫాయెత్ సిటీలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి మధుమిత - సాయిరాం దంపతులు,


యూఎస్ఏలో సోదురుడికి రాఖీ కడుతున్న సోదరి

దుబాయిలోని ఆర్జా అల్ నారాలో గుండా రజని- సతీశ్ దంపతులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం జరుపుకున్నారు. రక్షాబంధన్, యజ్ఞోపవితరణ(జంజిరం) ధరించారు.

రాఖీ కట్టుకుని.. గుండెపోటుతో మృతి

• నిద్రలోనే ప్రాణాలు విడిచిన యువకుడు

అనిల్(ఫైల్)

గొల్లపల్లి: రాఖీ పండుగ రోజు.. ఉదయం ఆ ఇంట్లో రక్షాబంధన్ వేడకలు ఆనందంగా జరుపుకున్నారు. సాయంత్రం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. రాఖీ పౌర్ణమి పర్వదినాన తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గరిగంటి అనిల్(24) హఠాన్మరణం అందరిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. కుటుంబ సభ్యులు.. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గరిగంటి తిరుపతి, సత్తవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. చిన్నకుమారుడు అనిల్ హైదరాబాద్‌లో ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల కిత్రం స్వగ్రామమైన రాఘవపట్నం వచ్చాడు. స్నేహితులతో ఉత్సాహంగా గడిపాడు. రాఖీ పండుగ సందర్భంగా అక్క అనూష ఇంటి కొచ్చింది. ఇద్దరు సోదరులకు రాఖీ కట్టింది. అనూష ఇంటికి రావడంతో ఆ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. అనిల్ మధ్యాహ్న భోజనం చేసి పడుకున్నాడు. సాయంత్రమైన లేవకపోవడంతో కుటుంబసభ్యులు నిద్రలేపారు. ఉలుకుపలుకు లేకపోవడంతో అతడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిద్రలోనే గుండెపోటు వచ్చినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. పండుగపూట జరిగిన ఈ ఘటన గ్రామస్తులను కలచి వేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉన్న కొత్తలేబర్ అడ్డా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతిచెందగా అతని భార్యకు గాయాలయ్యాయి. టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన చాడ కిషన్‌రెడ్డి(57) సీడ్ వ్యాపారం చేస్తూ.. కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య రమాదేవితో కలిసి బైక్‌పై మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిషన్‌రెడ్డి కింద పడి స్పృహ కోల్పోయాడు. అతని భార్య తలకు, కాళ్లకు గాయాలు కావడంతో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి సమీప బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిషన్‌రెడ్డికి ఇద్దరు కుమారులు ఉండగా ఆమెరికాలో ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాత అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది.

ఆగిఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడు..

నరేశ్ మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): చెల్లితో రాఖీ కట్టించుకున్న యువకుడు ఉత్సాహంగా ఇంటికి చేరే క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టి దుర్మరణం చెందాడు. ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మెయిన్ రోడ్డులో హన్‌మాన్ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బోరుబండిని శనివారం రాత్రి బైక్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పోతుగల్‌కు చెందిన కొప్పు నరేశ్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. కడుపులో తీవ్ర గాయాలు కాగా పేగులు బయటపడ్డాయి. చుట్టుపక్కల వారు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో నరేశ్‌ను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేశ్ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

కారును ఢీకొట్టిన బస్సు

• నలుగురికి గాయాలు


దెబ్బతిన్న కారు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని కోళ్లఫాం వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నపూర్‌కు చెందిన రాజు, మహేశ్, దేవేందర్, మణికంఠ కారులో కామారెడ్డికి వెళ్తున్నారు. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు బైక్‌ను తప్పించబోయి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.